



*శుక్లాంబరధరం విష్ణుం..*
ముద్దొచ్చే బొజ్జ గణపతి.
*కౌసల్య సుప్రజారామ..*
నిలువెత్తు వేంకటేశ్వరుడు.
*తల్లీనిన్ను దలంచి..*
చిరునవ్వుల సరస్వతీదేవి.
*వందే వందారు మందారం*
*ఇందిరానంద కందలమ్..*
సిరులతల్లి లక్ష్మీదేవి.
*నాగేంద్రహారాయ త్రిలోచనాయ..*
శివాత్మకమైన మహా లింగం.

# పరమాత్మ @ఫారిన్ బ్రాండ్

అంతేనా.. తథాగత బుద్ధుడు, కరుణామయుడైన క్రీస్తు, ప్రేమైక జీవులు రాధాకృష్ణులు.. ఇలా అనేకానేక రూపాలు మనల్ని ఆధ్యాత్మిక జగత్తువైపు లాక్కెళ్తాయి. దేనికదే అపురూపం. ప్రతి బొమ్మలోనూ జీవకళ, అంతులేని వింత కాంతి. వీటిని తయారుచేసింది ఏ భారతీయ సంస్థో కాదు. స్పానిష్ లగ్జరీ పోర్స్‌లిన్ బ్రాండ్.. లాడ్రో! స్పెయిన్ నుంచి వచ్చి మరీ మన దేవతల విగ్రహాలను విక్రయించడం వెనుక లాడ్రోకు పెద్ద వ్యూహమే ఉంది. ఇప్పటికే, లాడ్రో వ్యాపారంలో పదకొండు శాతం భారత్ నుంచే జరుగుతున్నది. ఆ వాటా ఇంకొంత పెంచాలన్నది ఆలోచన. పాశ్చాత్య శిల్పాలు, గృహాలంకరణ వస్తువులు కూడా విక్రయిస్తున్నా.. 'స్పిరిట్ ఆఫ్ ఇండియా' కలెక్షన్‌లో భాగమైన దేవతా మూర్తులకే గిరాకీ ఎక్కువ. వీటి ధరలు ఎనిమిదివేల రూపాయల నుంచి రెండున్నర కోట్ల వరకూ ఉంటాయి. ఈ మధ్యే లిమిటెడ్ ఎడిషన్‌గా తీసుకొచ్చిన 'కృష్ణార్జున-గీతా సందేశం' విగ్రహాలు శరవేగంగా అమ్ముడవుతున్నాయి. ధర అక్షరాలా ముప్పై తొమ్మిది లక్షలు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి విగ్రహానికి లభిస్తున్న ఆదరణ ఆ విదేశీ సంస్థను ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో ధరను రూ. పద్దెనిమిదిన్నర లక్షల నుంచి అమాంతం ముప్పై లక్షలకు పెంచేశారు. ఆన్‌లైన్ విక్రయాలు కూడా గణనీయంగా పెరిగాయని చెబుతున్నారు తయారీదారులు. ఈ మధ్యే లాడ్రో ఢిల్లీలో సువిశాలమైన షోరూమ్‌ను ప్రారంభించింది. 'భారత్‌లో విస్తరించాలనే ప్రయత్నంలో ఇది తొలి అడుగు' అంటారు ఆ సంస్థ సీఈవో అనా రోడ్రిగ్స్. భారతీయ సంస్కృతికి ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతున్నది. ఆ అవగాహన వల్లే కావచ్చు.. స్పిరిట్ ఆఫ్ ఇండియా కలెక్షన్‌కు ఇక్కడి కంటే అమెరికాలోనే గిరాకీ ఎక్కువ' అంటారు ఆమె.













